క్లుప్తంగా

డీఎల్‌పీఓగా జీవీఎస్ నారాయణ

కల్లూరు/ఏన్కూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కల్లూరు డివిజినల్ పంచాయతీ అధికారిగా అదనపు బాధ్యతలను గురువారం జీవీఎస్ నారాయణ చేపట్టారు. ప్రస్తుతం ఏన్కూరు మండల పంచాయతీ అధికారిగా ఆయన విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి

కల్లూరురూరల్: ధాన్యం కొనుగోలుకు సంబంధించి.. గ్రామాల్లో కేంద్రాలు ఏప్రిల్ ఒకటి నుంచి సిద్ధం చేయాలని తహసీల్దార్ పులి సాంబశివుడు స్పష్టం చేశారు. గురువారం తహసీల్‌లో వ్యవసాయ శాఖ, ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ ఒకటి నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎండలు అధికంగా ఉన్నందున కేంద్రాల్లో నీడ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని తహసీల్దార్ కోరారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

సత్తుపల్లిటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని బీజేపీ నాయకులు.. మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహాను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేష్, నాగస్వామి, శివ, శేషగిరిరావు, విజయ్, కార్తీక్, సాధు శివ పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాల రద్దును నిరసిస్తూ ధర్నా

బోనకల్: ట్రైకార్ రుణాల రద్దును నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం ముందు గిరిజన సంఘం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. లబ్ధిదారులకు రుణాలు ఇవ్వకుండా వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. వచ్చే నెల 7న రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు పంతు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వీల్‌చైర్స్ పంపిణీ

ఏన్కూరు: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏన్కూరు, కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గురువారం వీల్ చైర్స్ పంపిణీ చేశారు. కొణిజర్ల మండల పెద్దగోపతి పీహెచ్‌సీ చేతన ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ దొడ్డ సీతారామయ్య వీల్‌చైర్లను అందజేసి ఆస్పత్రులకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ అధ్యక్షుడు అనీల్‌కుమార్, నిర్వాహకులు మాదినేని నర్సింహారావు, సురేష్, భాస్కర్, నవీన్, రషీద్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటు

కల్లూరు: పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని ఇండిపెండెంట్ అసోసియేషన్ క్రిస్టియన్ కమిటీ, ఏబీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎనోష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సెంటినరీ బాప్టిస్ట్ చర్చి సికింద్రాబాద్ నందు పాస్టర్ ప్రవీణ్ భౌతికకాయాన్ని టీయూసీపీఏ జనరల్ సెక్రటరి గోనె సాల్మన్‌రాజుతో కలిసి సందర్శించి నివాళులర్పించారు. క్రైస్తవ సమాజం ఒక మంచి నాయకుడుని కోల్పోయిందన్నారు. ప్రవీణ్ మరణం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పోలీసులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటకు తీయాలని ఆయన కోరారు.

సీఐకి ఫిర్యాదు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ.. సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారంటూ పాస్టర్లు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ టి.కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై దూషణలు చేస్తూ క్రైస్తవ సమాజం, సేవకులపై కించపరిచే వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, పింగళి సామేలు, సందీప్‌గౌడ్, నిరీక్షణరావు, శ్యామ్‌సన్, యాకోబు, రాజు, ప్రభాకర్, ప్రసాద్, దేవ సహాయం, మ్యాథ్యూ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

బోనకల్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. స్థానిక తహసీల్‌లో ముస్లిం పెద్దలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి 8గంటల వరకు మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యసంఘం మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా, సభ్యులు చాంద్‌పాషా, జానీవియా, దస్తగిరి, మదార్‌సాహెబ్, మౌలాలి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల దోపిడీ..!

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లేవు
- మద్దతు ధరలేక నష్టాలు
- ఆందోళనలో రైతన్నలు



పందిళ్లపల్లిలో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్న పంట



జగన్నాథపురంలో కల్లంలో ఆరబోసిన మొక్కజొన్న పంట

చింతకాని: అరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను మధ్య దళారులు దోపిడీ చేస్తున్నారు. యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చి 15 రోజులు గడిచినప్పటికీ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో గత్యంతరం లేక రైతులు పంటను ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు విక్రయిస్తూ.. నష్టాలను నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా లక్షా 4వేల ఎకరాల్లో సాగు..

జిల్లా వ్యాప్తంగా యాసంగిలో మొక్కజొన్న పంటను లక్షా 4వేల ఎకరాల్లో రైతులు సాగుచేశారు. జిల్లాలోనే చింతకాని, బోనకల్, మధిర, వైరా, కొణిజర్ల, ముదిగొండ మండలాల్లో అత్యధికంగా రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సాగుచేసిన పత్తి పంట ఆశాజనకంగా లేకపోవటంతో పత్తి పంటను తొలగించి రైతులు మొక్కజొన్న పంటను అధికంగా సాగుచేశారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి..

ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పంట చేతికొచ్చి 15 రోజులు కావస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో దళారులు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. మొక్కజొన్న పంటను ప్రారంభంలో క్వింటాకు రూ.2,400 ధరతో కొనుగోలు చేసిన దళారులు వెంటనే రూ.300 నుంచి 400 లను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టెండర్లను పిలిచాం..



మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రవాణా కోసం టెండర్లను పిలిచాం. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే జిల్లా ఉన్నతాధికారులకు సూచనల మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ఏప్రిల్ నెల మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నాం.

– పెండెం సునీత, మార్క్‌ఫెడ్ డీఎం, ఉమ్మడి ఖమ్మం జిల్లా

తీవ్రంగా నష్టపోతున్నాం..



ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పంట చేతికొచ్చి 15 రోజులు కావస్తున్నా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తుంది.

– కిలారి బాబు, రైతు, పాతర్లపాడు

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ఉత్కంఠపోరులో అధ్యక్షుడిగా పుల్లారావు ఎన్నిక..



బోజడ్ల పుల్లారావు



గంధం శ్రీనివాసరావు

మధిర: మధిర బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి మినహా మిగిలిన పదవులను న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి బోజడ్ల పుల్లారావు, పల్లపోతుల కృష్ణారావు పోటీపడ్డారు. మొత్తం 33ఓట్లకు గాను 31ఓట్లు పోలయ్యాయి. ఉత్కంఠపోరులో పుల్లారావుకు 19ఓట్లు, కృష్ణారావుకు 12ఓట్లు వచ్చాయి. దీంతో 7ఓట్ల మెజార్టీతో పుల్లారావు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి వెంకట్రావు తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గంధం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జింకల రమేష్, సంయుక్త కార్యదర్శిగా భైరవబొట్ల రమణారావు, కోశాధికారిగా విజయ్ కుమార్ ఎన్నిక కాగా.. న్యాయవాదులు నూతన కమిటీని అభినందించారు. పుల్లారావు మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరోసారి పోటీ చేయగా ఓటమి చెందారు. ఈరోజు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. మొత్తం నాలుగు సార్లు అధ్యక్ష పదవి చేపట్టారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లెపూల వెంకటేశ్వరరావు..



వెంకటేశ్వరరావు

సత్తుపల్లి: సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లెపూల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా మహదేవ జనార్దనాచారి ఎన్నికయ్యారు. గురువారం సత్తుపల్లి బార్ అసోసియేషన్‌లో అధ్యక్ష, కోశాధికారుల పదవులకు ఎన్నికలు నిర్వహించారు. కాగా ప్రధాన కార్యదర్శిగా సాధు కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా కె.శంకర్‌రావు, క్రీడల సెక్రటరీగా జేవీ నరేంద్ర, గ్రంధాలయ సెక్రటరీగా నల్లగట్ల విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఇనపాల నర్సింహారావు, గుంట్రు శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి మాజీ బార్ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, అజయ్‌కుమార్, కూకలకుంట రవి, రాచూరి సీతారామయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

కల్లూరులో కరాటే సెల్ఫ్ డిఫెన్స్ పోటీలు



కరాటే పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు మినీ స్టేడియంలో మండలస్థాయి ఝాన్సీలక్ష్మీభాయి కరాటే సెల్ఫ్ డిఫెన్స్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో 12 పాఠశాలల నుంచి 120మంది నైపుణ్యం కలిగిన కరాటే విద్యార్థులను ఆహ్వానించి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ తులసి, ఎంఈఓ పత్తిపాటి నివేదితలు బహుమతులు అందించారు. అయితే క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లు, ఉపాధ్యాయులకు.. విద్యార్థి గ్లోబల్ ట్రస్ట్ ఫౌండేషన్ నిర్వాహకులు ఆళ్ల రంగారావు, బాజీని నరసింహారావు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీడీ బీమా, పీఈటీలు పసుపులేటి వీరరాఘవులు, రాధాకృష్ణ, రమాదేవి, తులసి, త్రివేణి, పద్మ, అప్పారావు, కరాటే మాస్టర్లు రేపల్లె బాలకృష్ణ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హోమ్ కేంద్రం ఏర్పాటు

మధిర: ఇంట్లో ఉన్న అదనపు సామాన్లు మరొకరికి ఉపయోగపడే విధంగా మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్డులో గురువారం హెల్పింగ్ హోమ్ అనే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిరుపేద కుటుంబాలకు హోం నీడ్స్ లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి అవసరాల కోసం దాతల సహకారంతో ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య ఆధ్వర్యంలో హెల్పింగ్ హోమ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పట్టణ ప్రముఖులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్ తదితరులు తెలిపారు. దాతల ఇళ్లకు కొండయ్య బృందం వెళ్లి ఇళ్లలో అదనంగా ఉన్న, స్టోర్ రూమ్‌లో వృథాగా ఉంచిన సామాన్లను సేకరించి హెల్పింగ్ హోమ్ కేంద్రానికి తరలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పారుపల్లి వెంకటేశ్వరరావు, బాబ్లా తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

కల్లూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లుగా చేసిన ప్రస్తుత మాజీ సర్పంచ్‌లు తమ పరిపాలన కాలంలో ఆగిన పెండింగ్ బిల్లులు కోసం అసెంబ్లీకి వెళ్తున్నారన్న సమాచారం మేరకు కల్లూరు పోలీసులు ఎస్సై డి.హరిత ఆధ్వర్యంలో ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కప్పలబంధం, వైఎస్‌పురం, బత్తుపల్లి, చంద్రుపట్ల, సింగరాల మాజీ సర్పంచ్‌లు శీలం ప్రసాద్, నారాయణ, పుల్లారెడ్డి, గొల్లమందల ప్రసాద్, పద్మాప్రసాద్‌లు ఉన్నారు.

కోడ్ ముగిసినా ముసుగు తొలగలే !

ఏన్కూరు: కోడ్ ముగిసినా.. అధికారులు విగ్రహాలకు ముసుగులు తొలగించలేదు. ఫిబ్రవరి నెలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నిర్వహించడంతో ఎన్నికల కోడ్ విధించడంతో అధికారులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. మార్చి మొదటి వారంలో ఎమ్మెల్సీ కోడ్ ముగిసినా.. ఇప్పటి వరకు విగ్రహాలకు ముసుగుతొలగించలేదు. మండలంలోని హిమామ్‌నగర్‌లో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి ఇప్పటి వరకు ముసుగు తొలగించలేదు. పంచాయతీ అధికారులు నిద్రలో ఉన్నారు అని పలువురు అంటున్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో సాయినాథుడికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి, కర్పూర హారతులిచ్చారు. భక్తులు బాబాని దర్శించుకున్నారు. అర్చకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా నిలయంలో రామన్నపాలెం గ్రామానికి చెందిన దాత గుర్రాల బాలాజీరెడ్డి – రాజ్యలక్ష్మి, జుజ్జూరుకు చెందిన జగన్మోహన్‌రావు – నాగమణి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

మినుములో దోమ ఉధృతి



బొట్లకుంటలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ బాలాజీ

కొణిజర్ల: మండలంలో సాగు చేస్తున్న మినుము పంటలో తెల్లదోమ, మరక మచ్చల పురుగు ఉధృతి బాగా కనిపిస్తుందని, రైతులు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ అన్నారు. గురువారం మండలంలోని బొట్లకుంట గ్రామంలో మినుము పంటను ఆయన పరిశీలించారు. తెల్లదోమ ఆకుల రసం పీల్చడం వల్ల పసుపు రంగులోకి మారి ఆకు రాలిపోతుందన్నారు. దీని నివారణకు ఎస్పెట్ 1గ్రాముకి.. లీటర్ నీరు చొప్పున కలిపి మొక్క తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి.. ఉదయం సాయంత్రం రెండు పూటలా వారంలో రెండుసార్లు రసాయన మందులు పిచికారీ చేయడం వల్ల పురుగును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు నున్నా నాగేశ్వరరావు, తుళ్లూరి వెంకటేశ్వర్లు నరసింహారావు పాల్గొన్నారు.

దుక్కిటెద్దు మృతి

కారేపల్లి: ట్రాన్స్‌కో నిర్లక్ష్యంతో ఓ దుక్కిటెద్దు విద్యుదాఘాతంతో మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని సూర్యతండా గ్రామ పంచాయతీ చంద్రుకగూడెం గ్రామానికి చెందిన రైతు అజ్మీర రామ్యాకు చెందిన రెండు దుక్కిటెద్దులు బుధవారం మేతకోసం చేనుకు వెళ్లాయి. ఈక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు ఆ చేనులో తక్కువ ఎత్తులో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు తగిలి ఓ దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. కాగా, ఘటనా స్థలానికి గ్రామ కార్యదర్శి భార్గవి చేరుకొని రైతు వద్ద వివరాలు సేకరించి, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్/తల్లాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన అద్దంకి రాము (32) ఈ నెల 23న ద్విచక్ర వాహనంపై తల్లాడ నుంచి సత్తుపల్లి మండలం నారాయణపురంలోని అత్తగారి ఇంటికి వస్తుండగా సత్తుపల్లిలో కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామును ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య నీలిమా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బోనకల్/ఎర్రుపాలెం: అసెంబ్లీలో కేటీఆర్‌పై డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని మాజీ జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బోనకల్ మండలంలోని రావినూతలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఎర్రుపాలెం మండలంలో గుంటుపల్లి గోపవరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టిని చాంబర్ ముందు 30శాతం కమీషన్లు అడుగుతున్నారని కాంట్రాక్టర్లు ఆందోళన చేయడం సిగ్గుచేటన్నారు. ఆ విషయాన్ని కేటీఆర్ అసెంబ్లీలో ప్రస్తావించగా కేటీఆర్‌పై దూషణలు చేయడం సరికాదన్నారు. వరికి సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రైతుల ఖాతాలో జమకాలేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లిఖార్జున్, మాజీ మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ప్రసాద్, ఎర్రుపాలెంలో.. మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసరావు, రేణుక, జయలక్ష్మి, రాధ, గోపాలరావు, మోహనరావు పాల్గొన్నారు.

ఆర్థిక వెసులుబాటు కల్పించాలి

మధిర: ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుంచి తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేందుకు ఖాతాదారులకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు కోరారు. మధిర పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన కొంగల జ్యోతి అనే మహిళ స్థానిక ఒక ప్రైవేట్ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఫైనాన్స్ కంపెనీ నుంచి జ్యోతి 17 నెలల క్రితం రుణం తీసుకొని 15 వాయిదాలు చెల్లించిందన్నారు. 16వ వాయిదా చెల్లించేందుకు కొద్దిరోజులు టైం అడిగితే బ్యాంక్ సిబ్బంది అంగీకరించి తిరిగి గురువారం ఇంటికి వెళ్లి డబ్బులు చెల్లించాలని జ్యోతిని ఒత్తిడి చేయడంతో పాటు ఆమె కుమారుడు దీపక్‌ని సైతం ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటువంటి వేధింపులను వెంటనే ఆపాలని, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వేధింపులపై పోలీసులు జోక్యం చేసుకుని వాటిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



సత్తుపల్లి మసీద్ వద్ద దువాలో పాల్గొన్న మట్టా దయానంద్

సత్తుపల్లిటౌన్: రంజాన్ మాసం సందర్భంగా సత్తుపల్లి జామె మసీద్‌లో గురువారం ముస్లింలకు ప్రభుత్వ ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ దువాలో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సదర్ నాయబ్ రసూల్, ఎండీ కమల్‌పాషా, గ్రాండ్ మౌలాలీ, రఫీ, ఎండీ ఫయాజ్ అలీ, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, చల్లగుండ్ల కృష్ణయ్య, చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, మొరిశెట్టి సాంబశివరావు, యూనిస్, మౌలాలీ, తోట సుజలారాణి, షాకీర్ పాల్గొన్నారు.

చింతకాని: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని చింతకాని గ్రామంలో ముస్లిం సోదరులకు చింతకాని సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కిలారు జగన్మోహన్‌రావు, సరోజిని దంపతులు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. గత పదేళ్లుగా గ్రామానికి చెందిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విందులో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు జగన్మోహన్‌రావు కుటుంబసభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మనోహర్‌బాబు, వేణుగోపాల్, దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ పోట్ల బాబురావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రాంబాబు

మధిర: ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని రాయపట్నం రోడ్డులో ఉన్న షాదీఖానాలో పేద ముస్లింలకు గురువారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్.ముజాహిద్ మాట్లాడుతూ.. సంఘం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్.హుస్సేన్, మహమ్మద్ గౌసుద్దీన్, షేక్.గాలిబ్, జమీర్, నజీమ్, సైదులు, హైదర్, జాకీర్ హుస్సేన్, మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు నగదు అందజేత..

ముదిగొండ: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లింల ఇఫ్తార్ విందుకోసం తహసీల్‌లో గురువారం తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ ముస్లిం మత పెద్దలకు రూ.50వేలు నగదును అందజేశారు.

ఆలయ హుండీ లెక్కింపు

శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.33,994..

మధిర: మధిర పట్టణంలోని శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 56 రోజులకు సంబంధించి రూ.33,994 ఆదాయం వచ్చినట్లు భద్రాచలం డివిజన్ దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ఈ.వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో సీహెచ్ రామకోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరి రవిశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

కోటమైసమ్మతల్లి హుండీ ఆదాయం రూ.55,463లు



కారేపల్లి: నగదు లెక్కిస్తున్న దృశ్యం

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీకోట మైసమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సాట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావుల సమక్షంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రత్నప్రభ పర్యవేక్షణలో చేపట్టిన హుండీ ఆదాయం రూ.55,463 వచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

నాగులవంచ సొసైటీకి రూ.1.25 కోట్ల లాభం



మాట్లాడుతున్న సీఈఓ శ్రీనివాసరావు

చింతకాని: మండలంలోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం 2024–25 సంవత్సరంలో రూ.1.25 కోట్ల లాభాన్ని అర్జించిందని సొసైటీ సీఈఓ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సొసైటీ ఆవరణలో గురువారం నిర్వహించిన మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది సొసైటీలో ఉన్నటువంటి 1,150మంది రైతుల్లో 980మంది రైతులకు ఇచ్చిన రుణాలను వడ్డీలు చెల్లించి రెన్యూవల్ చేసుకున్నారని తెలిపారు. అలాగే రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలను ఇవ్వటం జరిగిందన్నారు. సొసైటీలోని 801మంది రైతులకు 5.45 కోట్ల రుణమాఫీ వచ్చిందన్నారు. ఈ సభలో సొసైటీ చైర్మన్ శేషగిరిరావు, సొసైటీ పాలకవర్గ సభ్యులుపాల్గొన్నారు.

సొసైటీలో రూ. 5.33 కోట్ల బకాయిలు వసూలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి సొసైటీలోని 720మంది సభ్యుల నుంచి రూ. 5.33 కోట్ల బకాయిలు వసూలు అయ్యాయని సొసైటీ అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని, సొసైటీ అభివృద్ధికి రైతులంతా సహకరించాలని కోరారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, ఉపాధ్యక్షుడు గాదె చెన్నారావు, సీఈఓ సతీష్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేయండి

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో డయాలసిస్ కేంద్రం ఒక్కటే ఉండడంతో ఎప్పుడు కిడ్నీ రోగులు క్యూలో ఉండాల్సి వస్తుందని.. అదనంగా పెనుబల్లి, కల్లూరులలోని 50 పడకల ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. వారానికి మూడుసార్లు అందించకుంటే డయాలసిస్ రోగులకు ప్రాణాపాయ పరిస్థితి ఉంటుందని, పేదలకు డయాలసిస్ సేవలు అందుబాటులో ఉండేలా అదనంగా కేంద్రాలు మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం సెక్రటరీయేట్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యేలు పర్నికారెడ్డి, యశశ్వనిరెడ్డితో కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఎర్రుపాలెం: అర్హులైన పేదలకు ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మామునూరు, మీనవోలు తదితర గ్రామాల్లో సీపీఎం నాయకులు ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సురేష్, లాలా, నాయకులు తదితరులున్నారు.

వినతుల వెల్లువ..

తహసీల్దార్లకు వినతి..

కారేపల్లి/సత్తుపల్లిరూరల్/కల్లూరురూరల్/తల్లాడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ.. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో తహసీల్దార్లకు, కార్యాలయ సిబ్బందికి గురువారం వినతిపత్రాలు అందించారు. కారేపల్లి సింగరేణి తహసీల్‌లో.. సీనియర్ అసిస్టెంట్ పాషకు నాయకులు వినతిపత్రం అందించగా.. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ అధ్యక్షుడు గుమ్మడి సందీప్ మాట్లాడారు. అదే విధంగా సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ యోగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడికి, తల్లాడ తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన వాగ్దానాల అమలులో విఫలమైందన్నారు. మండలాల్లో పెండిగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్లు, రేషన్‌కార్డులు తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, సత్తిరెడ్డి, వీరన్న, శ్రీను, పాపారావు, రాజు, నాగిరెడ్డి, కె.ప్రసాద్, కృష్ణ, రాజారావు, అలివేలు, సురేష్, రామచంద్రరావు, హనుమంతురావు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఎ.వెంకన్న, మండలశాఖ కార్యదర్శి కె.పుల్లారావు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు జె.పరిమళ, సరోజిని, కల్లూరుటౌన్ కార్యదర్శి మంగన్న, డివిజన్ నాయకులు జయ, మాల్యాద్రి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ లాల్ మియా, డివిజన్ కార్యవర్గ సభ్యుడు డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకి వినతి..

కొణిజర్ల: అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, బోదకాలు వ్యాధిగ్రస్తులకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ.. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీఓ రోజారాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు సీవై పుల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగమైన బోధకాలు వ్యాధి గ్రస్తులను దివ్యాంగులుగా గుర్తించి రూ.10వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. తక్షణమే కొత్త రేషన్ కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అప్పారావు, సీతారాములు పాల్గొన్నారు.